



నీ వెంటే.. నేనమ్మా..

అద్వితీయంగా రాయండి!



ఆల్ ది బెస్ట్..వదలొద్దు

7 ఆల్ ది బెస్ట్.. పరీక్ష బాగా రాయాలమ్మా.. వదలొద్దు ఒక జాబ్ మనదే కావాలి.. కంగారుపడొద్దు పరీక్ష జాగ్రత్తగా రాయండి.. తదితర మాటలు గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద వినిపించాయి.. కనిపించాయి.. ఆదివారం కాకినాడలో 12 కేంద్రాల్లో గ్రూప్ పరీక్షలు నిర్వహించారు.. 9,379 మంది అభ్యర్థులకు 8,167 మంది పరీక్ష రాశారు...7లో

భళారే..బాలకా!

చిన్నారులా మజాకానా.. ఒక వేదిక ఇచ్చి మీ ఇష్టం అంటే ఏం చేస్తారు..రెప్పవాల్చనీయకుండా.. తమ టాలెంట్‌తో కట్టిపడేస్తారు.. భళారే అని పించుకుంటారు.. ది కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రం ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చిన్నారులు అదే చేశారు.

చిన్నారుల షో



7

అన్నవరంలో.. బో..ఫోర్స్!

4 ప్రధాన విభాగాల్లో దోపిడీ



అన్నవరం సత్యదేవుడి ఆలయంలో భో..ఫోర్స్ కుంభకోణం అంత పెద్ద కుంభకోణం జరుగుతోంది.. ఇది ఈ నాటిది కాదు.. చాలా ఏళ్లగా వేళ్లూనుకుపోయింది.. అయినా ఏ ఒక్కరూ దీనిపై దృష్టి సారించినవారే లేరు.. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆలయాల్లో భక్తులకు అందించే సౌకర్యాలపై చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో చివరి స్థానానికి చేరడంతో అందరి దృష్టీ ఈ ఆలయంపై పడింది.. ఇది జిల్లాకు మాయని మచ్చగా మారింది.. దీనిపై 'ఆంధ్రజ్యోతి' నిఘా పెట్టగా అసలు విషయం బయటపడింది.. తవ్వితే బోఫోర్స్ కుంభకోణం అంతగా ఉంది.. ఇదిలా ఉండగా ర్యాంక్ మెరుగుపరిచేందుకు అన్నవరం ఆలయంలో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం అన్నవరం ఆలయంలో సమీక్షించేందుకు సిద్ధమయ్యారు.

- కంటున్నావా.. సత్యదేవా
- ఐవీఆర్ఎస్ సర్వేలో చివరి స్థానం
- లోపమెక్కడని ఆంధ్రజ్యోతి ఆరా
- దోచుకుంటున్న దళారులు
- దర్శనమైనా..గదులైనా డబ్బులే
- మామూళ్ల మత్తులో అధికారులు
- నేడు కలెక్టర్ సమీక్ష

అన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో పనిచేసే సిబ్బందిలో చాలా మంది తమ జేబులు నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అర్చకుల నుంచి క్యూలైన్‌లో నిలబెట్టేవారు వరకూ అందరూ చేయి చాపే వారే.. చేయి తడిపితేనే దర్శనం చేయించేంతగా అవినీతి వేళ్లూనుకుపోయింది. అన్నవరం వచ్చిన భక్తులు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారనే విమర్శలున్నాయి. మిగిలిన ఆలయాల్లో భక్తులు పరోక్ష దోపిడీకి గురవుతుండగా రత్నగిరికి విచ్చేసిన భక్తులు ప్రత్యక్ష దోపిడీకి గురికావడమే చివరి ర్యాంక్‌కు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం దళారీ వ్యవస్థ. ఎక్కడికక్కడే దళారులు కొంత మంది సిబ్బందితో కుమ్మక్కై భక్తులను దోచుకుతింటున్నారు. సిబ్బంది కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం జరిగే సమీక్షలో అవలోకనం చేస్తే భక్తులు సంతృప్తి చెందవచ్చు. ఇక్కడ భక్తులు ప్రత్యక్షంగా దోపిడీకి గురవుతున్నది నాలుగు విభాగాల్లో మాత్రమే.

1 దళారీ..దేముళ్లు!

స్వామివారి దర్శనాలు, వైదిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటైన ఈ విభాగంలో దళారీ వ్యవస్థదే కీలక పాత్ర. రత్నగిరికి కార్లలో వచ్చే భక్తులనే దళారులు టార్గెట్‌గా పెట్టుకుంటారు. కారు పార్కింగ్ చేయగానే మీకు నేరుగా దర్శనం చేయిస్తామని, గర్భగుడిలో అర్చకులతో మెడలో పూలమాల వేయిస్తామని బేరసారాలు జరుపుతారు. ఒక్కొక్కరి వద్ద రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు లాగేస్తారు. బేరమయ్యాక దళారులు ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఫోన్ చేస్తారు. భక్తబృందాన్ని వారికి అప్పగిస్తారు. దర్శనం అయ్యాక ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగి డబ్బులను పంచుకుంటారు. ఈ తతంగమంతా సెక్యూరిటీ సిబ్బందికి తెలిసినా... వారు దళారీలతో ముచ్చటిస్తూ ఇంటికెళ్లే సమయంలో వారికి కొంత భాగమిస్తారు. ప్రకాష్ సదన్ కాటేజీ నుంచి పశ్చిమ రాజగోపురం వరకు దళారులు తిరుగుతుంటారు.

2 చేయితడిపితేనే.. వ్రతఫలం

సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తుల్లో అధిక శాతం స్వామివారి వ్రతాలు చేస్తారు. సామాన్యుల వ్రతం టిక్కెట్టు ధర రూ.300 అయితే పూర్తయ్యేసరికి మూడింతలు ఖర్చవుతుంది. టిక్కెట్టు రూ.300, వ్రతం పూజా సామగ్రి రూ.300, వ్రతం పూర్తయ్యాక పురోహితులకు దానాల రూపంలో స్వీకరించేది మరో రూ.300. ఇది కాకుండా వ్రతం అనంతరం శానిటేషన్ సిబ్బంది మూకుమ్మడిగా వ్రత మండపాల్లోకి వెళ్లి తాము స్వీపర్లమని యాచిస్తుంటారు. రత్నగిరి భక్తులు సగం ఛీత్కరించుకునేది ఇక్కడే.

3 ఛీ..ఆర్వో విభాగం

ఈ విభాగం కింద భక్తులకు వసతి గదులు కేటాయింపు జరుగుతుంది. పర్వదినాల్లో సాధారణ భక్తులకు కౌంటర్ గుమస్తాలు నరకం చూపిస్తారు. గదులు ఖాళీలు ఉన్నా సాధారణ భక్తుడికి గదులు ఇవ్వరు. అక్కడే ఉండే దళారులను సంప్రదించి కొంత అధిక మొత్తం చెల్లిస్తే మాత్రం వెంటనే గది దొరుకుతుంది. కేవలం రత్నగిరిపై 550 గదులు మాత్రమే ఉన్నాయి. సిఫార్సులు అధికం. దీంతో ఇక్కడ సామాన్య భక్తుడికి గది దొరకడం అసాధ్యం. ఇక్కడే వివాహ బృందాల దోపిడీకి దళారీ వ్యవస్థ కాచుకుని కూర్చుంటుంది. పురోహితుడు, సన్నాయిమేళం బేరం కుదుర్చుకుంటేనే వారికి లోపల ప్రవేశం ఉంటుంది. లేకుంటే అష్టకష్టాలే. దశాబ్దాలుగా ఇక్కడ దళారీ వ్యవస్థ వేళ్లూనుకుపోవడంతో ఎవరూ వారిని కదిలించలేకపోతున్నారు. వివాహ బృందాలకు స్వేచ్ఛ దొరకనివ్వకపోవడంతో దేవస్థానం అపఖ్యాతి పాలవుతోంది.

4 గలీజుల విభాగం!

భక్తుల సౌకర్యార్థం స్టాళ్లను ఏర్పాటు చేసే విభాగమే లీజుల విభాగం. దీన్ని సీ సెక్షన్‌గా పిలుస్తారు.ఇక్కడ దేవస్థానం నిర్దేశించే ధరలు అమలు జరగవు. ఉదాహరణకు సెల్‌ఫోన్ భద్రపరుచుకునేందుకు లైసెన్స్‌దారుడు ఒక్కో ఫోన్‌కు రూ.5 వసూలు చేయాలి ఇక్కడ రూ.10 వసూలు చేస్తాడు.ఇటీవల వినియోగదారుల కమిషన్ సైతం సదరు గుత్తేదారుపై జరిమానా వేసింది.మరోపక్క భక్తుల జోళ్ల జతకు రూ.2 వసూలు చేయాలి ఇక్కడ రూ.5 వసూలు చేస్తారు.పూజాసామగ్రి ధరలు, వివాహాలకు అవసరమైన డెకరేషన్ మండపాల ధరలు దేవస్థానం నిర్దేశించిన దానికంటే మూడింతలు ఎక్కువ.ఎక్కడా షాపుల వద్ద ధరల పట్టికలు ఉండవు. లీజుల విభాగం అధికారులు దీనిపై దృష్టిసారించరు. ఎందుకంటే మామూళ్ల మత్తు.ఎంఆర్‌పీ ధరలతో విక్రయాలు జరగవు. మామూళ్ల మత్తులో అధికారులు ఊగుతుండడం దౌర్భాగ్యంగా పేర్కొనవచ్చు.



చిత్రాడలో ఎస్‌బీ లే-అవుట్‌ను పరిశీలించి చర్చిస్తున్న జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు

జనసేన ఫస్ట్ షో

- మార్చి 14న జనసేన ప్లీనరీ
- అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సమావేశం
- అధినేత పవన్ దిశానిర్దేశం
- చిత్రాడలో వేదిక ఖరారు
- ఒకే రోజు నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న నేతలు

పిఠాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జనసేన ప్లీనరీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. మార్చి 14న జనసేన ప్లీనరీని పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించాలని ఇప్పటికే పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. జనసేన పార్టీ నూరుశాతం స్ట్రైక్‌రేట్‌తో అధికారంలోకి రావడం.. అధికారంలో భాగస్వామ్యమైన తర్వాత తొలి ప్లీనరీ కావడంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ ప్లీనరీకి ఏపీ, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి జనసైనికులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.ఈ మేరకు కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారులో 216వ జాతీయ రహదారి చెంతనే ఉన్న 80ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు లేఅవుట్ (ఎస్‌బీ సిటీ) జనసేన ప్లీనరీకి వేదిక కానుంది. ఉదయం ప్లీనరీ సమావేశాలతో పాటు సాయంత్రం ఇక్కడే బహిరంగ సభ నిర్వహించనున్నారు.వాహనాల పార్కింగ్, వచ్చే నాయకులు, ముఖ్యఅతిథులు, కార్యకర్తలు భోజనాలు చేసేందుకు అనువైన ప్రాంతంగా దీన్ని గుర్తించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు జనసేనలోని ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. అక్కడ ఏ విధమైన ఏర్పాట్లు చేయాలన్న అంశంపై పార్టీ నాయకులు పరిశీలన జరిపారు. గతంలో మాదిరిగా మూడు రోజులు కాకుండా ఒకే రోజు ప్లీనరీ కావడంతో అక్కడే ఉదయం పార్టీ ప్రతినిధుల సమావేశం, సాయంత్రం బహిరంగ సభ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పార్టీ రాష్ట్ర నేతలు మరోమారు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు.. ప్లీనరీ వేదికను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు,గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, రాజమహేంద్రవరం జనసేన అధ్యక్షుడు వై.శ్రీనివాస్, ఇతర నాయకులు పరిశీలించారు. ప్లీనరీ, బహిరంగ సభల నిర్వహణ, వాహనాల పార్కింగ్ తదితరాలకు అక్కడ ఉన్న ప్రదేశం ఎంత వరకూ సరిపోతుందనే అంశంపై అంచనాలు వేశారు. నెలాఖరు లేదా మార్చి 1న పార్టీ ముఖ్యనేతలు పిఠాపురం వస్తున్నట్టు సమాచారం. వీరు వచ్చి పరిశీలన జరిపి తుది నిర్ణయం తీసుకున్న తర్వాత ఏర్పాట్లు వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

పరీక్షల కాలం.. ప్రణాళిక ముఖ్యం



- మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 28,963మంది పది, 44,531మంది ఇంటర్ విద్యార్థులు

కాకినాడరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయం సమీపిస్తోంది. ఉత్తమ మార్కులు సాధించేందుకు ఇప్పటికే జిల్లాలోని ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులు సిద్ధమవుతున్నారు.సన్నద్ధత, పునశ్చరణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మార్చి నెలలోనే పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఉండడంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన, మరికొంత భయం నెలకొంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

● సమయపాలన

పరీక్షలకు ముందే అన్నిపాఠ్యాంశాలపై పట్టు సాధించేలా చదవడానికి రోజువారీగా సమయపాలన ప్రణాళిక వేసుకోవాలి. దైనందిన అవసరాల సమయాన్ని కుదించుకుని ఏకాగ్రతతో ఎప్పుడు చదవగలమో నిర్ధారించుకోవాలి.

● ప్రణాళిక అవసరం

విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఎప్పటి పాఠాలు అప్పుడే చదివే విద్యార్థుల్లో పరీక్షలపై అంతగా ఆందోళన ఉండదు. అలా కాకుండా విద్యా సంవత్సరం పొడవునా సరదాగా గడిపి పరీక్షల సమయంలో ఇన్ని సబ్జెక్టులు చదవగలమా అనే ఆందోళనపడే విద్యార్థులు ఉంటారు. అందుకే ప్రణాళిక అవసరం. రోజులో ఎన్ని సబ్జెక్టులు చదవాలి, వారంలో ఎన్నింటిని పూర్తి చేయాలనే ప్రణాళికను సిద్ధం చేసుకోవా లి. పాఠ్యాంశాల్లోని ముఖ్యాంశాలు, ప్రశ్నల సర ళి,ప్రశ్నాపత్రం ఎలాఉంటుంది, మార్కుల కేటాయింపుపై అవగాహన పెంచుకోవాలి. గత ప్ర శ్నాపత్రాలను సాధనకు ప్రణాళిక వేసుకోవాలి.

● పునశ్చరణ చేయాలి

పరీక్షల ముందు భయం వీడేందుకు ప్రాక్టీస్ పేపర్లను సాధన చేయాలి. పాఠ్యాంశాలను చదివేందుకు, పునశ్చరణకు వేర్వేరుగా సమయాన్ని కేటాయించాలి. సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకోవాలి. విద్యార్థులు ఏకధాటిగా చదవకుండా ప్రతి గంటకు 5నుంచి 10 నిమిషాలు విరామం తీసుకోవాలి.

● సోషల్ మీడియాకు దూరంగా..

సెల్‌ఫోన్లు, భావోద్వేగాలను కలిగించే సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి. సినిమాలు, టీవీ చూడడం పరీక్షలు పూర్తయ్యే వరకూ పక్కన పెట్టాలి, విందులు, వేడుకలకు వెళ్లడం తగ్గించడం మంచిది.

● సమతుల ఆహారం తీసుకోవాలి

పరీక్షలకు సన్నద్ధ సమయంలో విద్యార్థులు సమతుల ఆహారం తీసుకోవాలి. ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ ఉండే ఆహారం, తగినంత నీరు తాగుతూ, పండ్లు తినాలి. పరీక్షలు పూర్తయ్యే వరకూ మాంసాహారం, కొవ్వు పదార్థాలు, మసాలాలు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.

● మార్చి 1నుంచి పరీక్షలు

పదోతరగతి, ఇంటర్ పరీక్షలు మార్చిలో ప్రారంభం కానున్నాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకూ జరగనున్నాయి. కాకినాడ జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 22,660 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 21,871మంది హాజరుకానున్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకూ జరగనుండగా ఈ పరీక్షలను జిల్లాలో 28,963మంది రాయనున్నారు. సార్వత్రిక విద్యకు సంబంధించిన పది పరీక్షలు మార్చి 17 నుంచి 28 వరకూ, ఇంటర్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకూ జరగనున్నాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 8873మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

● చదివిన అంశాలను రాస్తుండాలి

-డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

విద్యార్థులంతా చదివిన అంశాలను రాస్తుండాలి. అలా రాయడం ద్వారా ఎక్కువగా గుర్తుంటాయి. ఉదయం కొంత సమయం చిన్న చిన్న వ్యాయామాలు, ధ్యానం, యోగా చేయడం ద్వారా ఒత్తిడి దూరమవుతుంది. కొంత సేపు నడవడం ద్వారా రక్తప్రసరణ పెరిగి మెదడు చురుగ్గా పనిచేస్తుంది. చదువుకున్న అంశాల గురించి స్నేహితులతో చర్చించాలి అలా చేయడం ద్వారా బాగా గుర్తుంటాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు సహకరించాలి.

నేటి నుంచి..

కుక్కుటేశుని కల్యాణోత్సవాలు



పిఠాపురం పాదగయ పుష్కరిణి

- మహాశివరాత్రికి ముస్తాబవుతున్న పాదగయ
- స్వయంభూ క్షేత్రాలకు నెలవుగా పాదగయ క్షేత్రం
- మూసివాయినాల సమర్పణకు ప్రాధాన్యం
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

పాదగయక్షేత్రం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఏటా ఈ సందర్భంగా ఐదు రోజులపాటు నిర్వహించే రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శివుడికి ప్రీతికరమైన సోమవారంరోజున స్వామి,అమ్మవార్ల కల్యాణం,బుధవారం మహాశివరాత్రి, గురువారం రథోత్సం, శుక్రవారం తెప్పోత్సవం జరగనున్న భక్తులు భారీగా తరలివచ్చే అవకాశాలున్నాయి.

పిఠాపురం పాదగయ క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రాశస్త్యం ఉంది. ఏటా మహాశివరాత్రి రోజున పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తే పాపాలు హరించి మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. స్నానాలు ఆచరించి పితృదేవుళ్లకు పిండ ప్రదానాలు (మూసివాయినాలు) నిర్వహించడం ఆనవాయితీ. వీటి నిర్వహణకు దేశంనలుమూలలనుంచి అనేక మంది భక్తులు తరలివస్తూ ఉంటారు. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాల్లో నిర్వహించే రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు ఫిబ్రవరి 24నుంచి 28 వరకూ జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు, మూసీ వాయినాల సమర్పణకు ఉభయ తెలుగురాష్ట్రాలనుంచేగాక మహారాష్ట్ర,ఒడిస్సా,బీహార్, తమిళనాడు, కర్నాటక, కేరళ, ఢిల్లీ, హర్యానా, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. మహాశివరాత్రి పర్వదినంతోపాటు స్వామి, అమ్మవార్ల కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఇందుకు తగ్గట్టుగా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాట్లపై కలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ బిందుమాధవ్, పాడా పీడీ శ్రీధర్, దేవదాయశాఖ సంయుక్త కమిషనరు సుబ్బారావు, డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ మధుసూదన్ సమీక్షలు నిర్వహించారు.

పరమశివుడు లోకకల్యాణార్థం గయాసురుని సంహరించేందుకు కోడిరూపాన్ని ధరించగా గయాసురుడి కోరిక మేరకు లింగరూపుడై స్వయంభువమూర్తి కుక్కుటేశ్వరుడిగా ఇక్కడ వెలిశారని విశ్వాసం. నాటినుంచి మహాశివరాత్రి పర్వదినాల సమయంలో కుక్కుటేశుడి కల్యాణోత్సవాలు ఏటా జరుగుతున్నాయి.

కార్యక్రమాలిలా..

- 24న పాదగయలోని రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 8.32 గంటలకు తొలిరోజు స్వామి, అమ్మవార్ల దివ్య కళ్యాణం నిర్వహిస్తారు.
- 25న గ్రామోత్సవం, కుంకుమార్చన
- 26న మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము 2గంటలనుంచి కుక్కుటేశ్వర స్వామి నిజరూపదర్శనం జరగనుంది.
- 27న కుంకుమార్చన, సహస్ర పుష్పార్చన, నాకబలి-దండాడింప-దొంగల దోపు ఉత్సవం, ఉత్సవవిగ్రహాల ఊరేగింపు, రథోత్సవం నిర్వహిస్తారు. అర్ధరాత్రి భారీ బాణసంచా కాలుస్తారు.
- 28న త్రిశూలస్నానం, హంసవాహనంపై తెప్పోత్సవం,శ్రీపుష్పయాగం జరుగుతాయి.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

-కాట్నం జగన్మోహన శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి, పాదగయ

మహాశిరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే అన్నిశాఖల అధికారులతో జిల్లా కలెక్టర్, పాడా పీడీ, జిల్లా ఎస్పీ, దేవదాయశాఖ ఆర్‌జేసీలు ఏర్పాట్లు పరిశీలించారు. వారి సూచనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు, దర్శనాలకు వెళ్లే వారికి ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు పటిష్టంగా ఏర్పాటు చేశాం. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నాం.

భళా బాల!

» ఉత్సాహంగా చిన్నారుల రాష్ట్రస్థాయి నాటికలు, సాంస్కృతిక పోటీలు

» రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన చిన్నారులు



కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరిగిన మూకీ ప్రదర్శన



చిన్నారుల జానపద నృత్యం



విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నాటికలు, చిన్నారుల ఏకపాత్రాభినయాలు, జానపద నృత్యాలతోచే సిన సందళ్లు.. చిత్రలేఖనంతో ఆకట్టుకునేలా గీసిన చిత్రాలు.. సందేశాత్మక నాటికలతో ప్రేక్షకుల మెప్పు పొందుతూ సాగిన చిన్నారుల రాష్ట్రస్థాయి నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అబ్బురపరిచాయి. ది కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రం ప్రాంగణంలో రాష్ట్రస్థాయి చిన్నారుల నాటికలు, సాంస్కృతిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పోటీలను ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు, కార్యదర్శి పీవీ రావు, కార్యక్రమాల నిర్వాహకులు నాదెళ్ల ప్రభుదాసు, ఎంవీ రమణ తదితరులు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు.

అనంతరం దంటు భాస్కరరావు, పీవీ రావులు చిన్నారులనుద్దేశించి మాట్లాడుతూ చిన్నారులను రంగస్థల కళవైపు ఆకర్షితుల్ని చేయడం ద్వారా కళారంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఎందరో నటీనటులు, సాంకేతిక నిపుణులను చిత్రసీమకు అందజేసిన ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం పోటీలు, నాటికల ప్రదర్శనలు నిర్వహించారు. ఉదయం 8.30గంటల నుంచి ప్రారంభమైన నాటికల పోటీలు రాత్రి వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా ది బ్లూక్రస్ట్ పాఠశాల కాకినాడ వారి తెనాలి రామకృష్ణ నాటిక, ఇంద్రపాలెం ఉషోదయ మెరిట్ స్కూల్ వారి అనుసరణ నాటిక, తిమ్మాపురం శారదా విద్యాలయం వారి సోషల్ మీడియా నాటిక, అడ్డంగడి ఎంపీయూపీ పాఠశాల వారి భిన్నత్వంలో ఏకత్వం నాటిక, ఉప్పాడ కొత్తపల్లి వీవీఎస్ హైస్కూల్ వారి ఆడపిల్లలను పుట్టనిద్దాం నాటిక తామరాడ జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ వారి మాతృదేవోభవ నాటిక, పిఠాపురం శ్రీదర్శ హైస్కూల్ వారి ఏరువాక నాటిక, కోటనందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వారి నేరం ఎవరిది నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అతిథులుగా డీవీ శివకుమార్(బెహెరెన్), పట్నాల రాము, కేవీఎస్ సీతారామ్, ముంజులూరి విశ్వేశ్వరరావు, వాసు, మార్ని జానకిరామ్‌చౌదరి, గౌరీనాయుడు, సురభిశారద తదితరులు పాల్గొన్నారు. చిన్నారులను కళలు, రంగస్థల ప్రదర్శనల వైపు ప్రోత్సహించేందుకు నాటికల ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. నాటికల ప్రదర్శనలు చూసేందుకు వచ్చిన చిన్నారులతో దంటు కళాక్షేత్రం సందడిగా మారింది.

ఉత్సాహభరితంగా క్రీడాపోటీలు



● ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఆదివారం విజేతల వివరాలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం ఏడు మ్యాచ్‌లు జరిగాయి. డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

హిమాచల్‌ప్రదేశ్, కేరళ సెక్రటేరియట్ పురుషుల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు 4-1 తేడాతో విజయం సాధించింది. తెలంగాణ, మహ రాష్ట్ర సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ 10-2 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జట్టుల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా 5-1 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ చెన్నై ఆర్ఎస్బీ చండీఘర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ చెన్నై 4-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 3-0 తేడాతో గెలిచింది. ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌ఘడ్ 7-1 తేడాతో విజయం సాధించింది. మధ్యప్రదేశ్, కేరళ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది.



గెలిచిన కేరళ టీం



హోరా హోరీగా తలపడుతున్న క్రీడాకారులు



గెలిచిన కేరళ టీం ఆనందంతో డ్యాన్స్

దివాన్‌చెరువు ఫ్లైఓవర్‌కు లైన్‌క్లియర్

● 2.55 కిలోమీటర్ల దూరం

● రూ.327 కోట్ల అంచనా వ్యయం

రాజమహేంద్రవరంఅర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు 16(హౌరా-చెన్నయ్)- 216ఏ (గుండుగొలను-కొవ్వూరు-గామన్ ఇండియా వంతెన)ల ను కలుపుతూ దివాన్‌చెరువు సెంటర్లో ఫ్లైఓవర్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. గామన్ వంతెన జంక్షన్-దివాన్‌చెరువు జంక్షన్-ఫ్రూట్ మార్కెట్ సెంటర్‌ను కలుపుతూ ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. మొత్తం రూ.2.55 కిలోమీటర్ల దూరం, రూ.327 కోట్ల అంచనా వ్యయంతో చేపడతారు. ఈమేరకు కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అనుమతులు మంజూరు చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చొరవతో కేంద్ర ప్రభుత్వం ఈ ఫ్లైఓవర్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించింది. దివాన్‌చెరువు వద్ద ఫ్లైఓవర్ ఆవశ్యకతను తెలియజేస్తూ గత ఏడాది జూలైలోనే ఎంపీ పురందేశ్వరి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి లేఖ రాశారు. గామన్ వంతెనపై ట్రాఫిక్ విపరీతంగా పెరగడంవల్ల దివాన్‌చెరువు సెంటర్‌లో ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పేర్కొంటూ తక్షణమే ఫ్లై ఓవర్ మంజూరు చేయాలని ఆ లేఖలో కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం దివాన్‌చెరువు సెంటర్లో ఫ్లైఓవర్‌కు అనుమతులు మంజూరు చేసింది. ఈ ఏడాది మార్చిలో దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వికసిత భారత్ టార్గెట్

● కేంద్ర బడ్జెట్‌పై మేథావుల సదస్సులో ఎంపీ పురందేశ్వరి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి, పాల్గొన్న వివిధ వర్గాల ప్రముఖులు, బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ రూపొందించారని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బడ్జెట్‌పై ఆదివారం నిర్వహించిన మేథావుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు, యువత, రైతులు, పెట్టుబడులు ప్రధాన అంశాలుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ తయారు చేశారన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారన్నారు. దీనికనుగుణంగా రూ.50 లక్షల 50 వేల కోట్లకుపైగా కేంద్రబడ్జెట్ ఉందన్నారు. డాక్టర్ అంబేడ్కర్‌ను గౌరవించడమే కాకుండా ఆయన ఆలోచనలకు అనుగుణంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బడ్జెట్‌లో యువతకు కేటాయింపులు పెంచారని, ఇప్పటికీ దేశంలో 55శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నందున రైతుల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సాయి హాస్పటల్స్ అధినేత డాక్టర్ విజయకుమార్, క్రెడాయ్ ప్రతినిధి బుడ్డిగ శ్రీనివాస్, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, బీజేపీ నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, కంటిపూడి సర్వారాయుడు, బొమ్ముల దత్తు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, నీరుకొండ వీరన్నచౌదరి, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పాల్గొన్నారు.

డీజే సౌండ్స్ ఆపడంతో పోలీసులపై దాడి

● కొమరిపాలెంలో ముగ్గురి అరెస్టు, రిమాండ్

బిక్కవోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో గస్తీ తిరుగుతున్న ఇద్దరు పోలీసులపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం.. తమ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన హోంగార్డు ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ జీపులో పందలపాక, ఊల పల్లి మీదుగా కొమరిపాలెం గస్తీ తిరుగుతుండగా కొమరిపాలెంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో హరిజనపేటలో డీజే సౌండ్స్ వినబడడంతో అక్కడకు వెళ్లి సౌండ్స్ ఆపివేయించారు. దీంతో అక్కడ మద్యం తాగుతున్న నూతిక అజయ్, లంక మధు, రాయుడు ప్రదీప్ మాపేటలోకి వచ్చి సౌండ్స్ ఆపుతారా అంటూ హోంగార్డు ప్రకాష్ చేతిలోని లాఠీ తీసుకుని అతన్ని కొట్టి కింద పడవేశారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ వెళ్లగా అత న్ని కూడా కొట్టి లాఠీ విరగ్గొట్టి, చొక్కా చింపేసి సెల్ ఫోన్ లాక్కుని అతడిని పక్కనున్న డ్రైనేజీలో పడవేశారు. ఈ ఘటనలో గాయాల పాలైన పోలీసులిద్దరూ అనపర్తి ఏరి యా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని ఫిర్యాదు చేయగా ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. అనపర్తి కోరుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్ఐ వివరించారు.

సైబర్‌మోసం

● రూ.10 లక్షలు హుష్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని టి.నగర్‌కి చెందిన ఆదిత్య శ్రీకాంత్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. గత డిసెంబరు నెలలో టెలిగ్రాం ద్వారా ఓ ఫైనాన్స్ కంపెనీ లింక్ వచ్చింది. తమ వద్ద పెట్టుబడి పెడితే రెట్టింపు సొమ్ము వస్తుందని నమ్మించారు. దీంతో దఫదఫాలుగా శ్రీకాంత్ పెట్టుబడి పెట్టడం మొదలు పెట్టాడు. రూ.10లక్షలు పెట్టుబడి పెట్టిన తర్వాత ఆ కంపెనీ యాప్ పని చేయడంలేదని, తాను మోసపోయానని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మంగాదేవి తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

● రూ.1,26,290 స్వాధీనం

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం చీడిగ పేకాట స్థావరంపై దాడి చేసి 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,26,290 స్వాధీనం చేసుకున్నట్టు ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. 10మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

WANTED ELECTRICAL & INSTRUMENTATION ENGINEER HAVING EXPERIENCE IN THE FIELD OF OIL PALM PROCESSING WITH CAPTIVE POWER.3-5 EXPERIENCE WITH BTECH ELEC TRICAL& INSTRUMENTATION . SALARY 30-50K BASED ON EXPERIENCE. LOCATION: 15 KM FROM ELURU, ELURUDISTRICT. CONTACT: PREUNIQUE INDIAPRIVATE LIMITED CONTACT: 99891 96919, 98494 94331

AJN-193150

4 Lines CLASSIFIED Rs. 230/- Only



కాకినాడలో గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు

● కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు



పరీక్షా కేంద్రానికి పరుగెడుతున్న అభ్యర్థి

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో 12 కేంద్రాల్లో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. జిల్లా యంత్రాంగం పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగాయి. 12 కేంద్రాల్లో ఉదయం 9379 మంది అభ్యర్థులకుగాను 8167 మంది అభ్యర్థులు హాజరుకాగా, 1212మంది పరీక్షకు హాజరు కాలేదు. 86.06 శాతం నమోదైంది. మధ్యాహ్నం 9379మంది అభ్యర్థులకుగాను 8163మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా 1216 మంది హాజరు కాలేదు. 85.94శాతం నమోదైంది. ఏపీపీఎస్సీ మెంబర్ సోనీవుడ్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు జేఎన్‌టీయూ కాకినాడ కేంద్రాలను తనిఖీచేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.



పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం, పరీక్షా కేంద్రం వద్ద కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

సహజ వనరులపై ఆంధ్రులకే హక్కు



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్

● కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్

● మన గ్యాస్, మన చమురు-ఆంధ్రుల హక్కు అంశంపై సదస్సు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కృష్ణ, గోదావరి బేసిన్‌లో లభ్య మవుతున్న గ్యాస్, చమురుతదితర సహజ వనరులపై ఆంధ్రులకే హక్కు ఉంటుందని, రూ.లక్షల కోట్ల విలువైన సహజ సంపదను కార్పొరేట్ సంస్థలు దోచుకుపోతున్నాయని కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవీఎస్ మహాదేవ్ మండిపడ్డారు. కాకినాడ గాంధీభవన్‌లో ఆదివారం మన గ్యాస్, మన చమురు ఆంధ్రుల హక్కు నినాదంతో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహాదేవ్ మాట్లాడుతూ కేజీ బేసిన్‌లో బొంబాయ్ కంటే చమురు నిల్వలు అత్యధికంగా ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు క్షేత్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. ఇక్కడి నుంచి రూ.60లక్షల కోట్ల విలువైన చమురు నిల్వలను కార్పొరేట్ సంస్థలు తరలించుకుపోతున్నా యన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 38, 39బి ప్రకారం సహజ వనరులు ఏ ప్రాంతలో వెలికితీసినా ఆ ప్రాంత అభివృద్ధికి 30శాతం ఖర్చుచేయాలని ఉన్నప్పటికీ ఆచరణలో శూన్యంగా ఉందన్నారు. ఇదే విధంగా కొనసాగితే కోనసీమ ప్రాంతంలో దాదాపు 40 వేల ఎకరాల భూముల్లో పంటలు పండకుండా ఉప్పు భూములుగా మారిపోతాయన్నారు. సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సహజ వనరుల పరిరక్షణకోసం ఈ సదస్సు ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో ఇది అతి పెద్దఉప్పెనగా మారుతుందన్నారు. నేడు కాకినాడలో కూడా పెద్ద భవనం కడితే అది భూమిలో కూరుకుపోతుందనే భయంతో ప్రజలు ఉన్నారన్నారు. సభాధ్యక్షుడు ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రాంత వాసులకు ఉద్యోగ, ఉపాధి కల్పించకుండా రాష్ట్ర సహజ వనరులను తరలించుకుపోతున్నారన్నారు. సామాజికవేత్త అక్కినేని వనజ, న్యాయవాది జవహర్ ఆలీ మాట్లాడుతూ యువత అవగాహన కలిగి సహజ సంపదను కాపాడుకునే విధంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు డేగ ప్రభాకర్, రాష్ట్ర బీకేఎంయు కార్యదర్శి తాటిపాక మధు, నాయకులు కామిరెడ్డి బోడకొండ, వాసిరెడ్డి ఏసుదాసు, తోకల ప్రసాద్, పప్పు ఆదినారాయణ, కోణాల భీమారావు, పెదిరెడ్ల సత్యనారాయణ, టి.అన్నవరం కె.కిషోర్, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు కథా సాహిత్యంలో వేట కథలు ప్రత్యేకం

● వేటకథల సదస్సులో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సాహితీ సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు

యానాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు కథా సాహిత్యంలో వేట కథలు ఎంతో ప్రత్యకమైనవని కొంత మంది కథకులు అద్భుతమైన వేటకథలు రాశారని పలువురు వక్తలు అన్నారు. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు వేటకథలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయని వక్తలు వివరించారు. ఆదివారం ఉదయం స్థానిక సర్వశిక్షఅభియాన్ సమావేశపు హాలులో సాహిత్య అకాడమీ- స్ఫూర్తి సాహితీ సమాఖ్య యానాం సంయుక్త నిర్వహణలో వేటకథలు-సదస్సు అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి సాహిత్య అకాడమీ సభ్యులు చింతకింది శ్రీనివాసరావు ప్రారంభసభకు స్వాగతోపన్యాశం పలుకులు వేటకథలుపై ఏ భాషలోను ప్రత్యేక సదస్సు జరగలేదని తెలిపారు. వేటకథలుపై అకాడమీ, స్ఫూర్తి సాహితీ సంస్థ ద్వారా యా నాంలో నిర్వహించిన సదస్సుకు ఏంతో విశిష్టత ఉందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్ఎ మునిస్వామి మాట్లాడుతూ ఇంతమంది సాహితీవేత్తలతో యానాం సాహిత్యసదస్సు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలుగుభాష ఎంతో సుందరమైనదన్నారు. అనంతరం సాహిత్య అకాడమీ తెలుగుసలహా సంఘం కన్వీనర్ రచయిత్రి సి.మృణాళిని అధ్యక్షోపన్యాసం చేశారు. మనిషికి జంతువులకు అనుబంధం. అలాగే మనిషికి మనిషికి మధ్య సంబంధాలను వేటకథలు విశ్లేశిస్తాయన్నారు. గౌరవ అతిథి స్ఫూర్తి సాహితీ సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ ప్రత్యేకంగా వేటకథలు సదస్సు నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. వేట కథలకు ఇంతమంది సాహితీవేత్తలతో సదస్సు జరగడం ఇదే ప్రథమంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభసభకు కథకుడు రత్నాకర్ పెనుమాక వందన సమర్పణ చేశారు. అనంతరం నిర్వహించిన మొదటి సదస్సుకు యానాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త వాసిరెడ్డి నవీన్ అల్లం శేషగిరిరావు కథలపై మాట్లాడారు. వేటకథలు అద్భుతంగా రాసిన కథకుల్లో అల్లం శేషగిరిరావు ప్రముఖంగా నిలుస్తారని అన్నారు. ఆయన రాసిన కథల్లో ఒకటైన చీకటి కథ గురించి ప్రత్యేకంగా వివరించారు. ఈ కథలో ఎన్నో లేర్లు ఉంటాయని ఒక్కొక్క లేరు జీవితంలో చీకటి గురించి, సమాజంలో చీకటి గురించి గొప్పగా రాసిన కథ అన్నారు. జేపీ వైద్య కథలపై ప్రముఖ కవి అవధానుల మణిబాబు మాట్లాడారు. ఆ కథల్లో ప్రస్తావించిన అంశాలను వివరించారు. రెండో సదస్సుకు కాళ్లకూరి శైలజ అధ్యక్షత వహించి మాట్లాడారు. జె.నీరజ పతంజలి కథలు గురించి మాట్లాడారు. జంతువులను వేటాడటం కాదని జంతువులా మారుతున్న మనిషిని వేటాడాల్సిన పరిస్థితులపై పతంజలి ఆందోళన వక్తంచేస్తారన్నారు. ఆయన కథలు ఎంతో ఆలోచనాత్మకంగా లోతైన అంశాలతో ఉంటాయన్నారు. ఎస్వీ రంగారావు, ఇతర రచయితల వేట కథలపై ప్రముఖకవి, కథకుడు అద్దేపల్లి ప్రభు మాట్లాడారు. వేటలో ఎన్నో రకాలు ఉన్నా యన్నారు. రాజుల వేట అలాగే గిరిజనులు చేసే వేట, సముద్రంలో చేసే వేట ప్రపంచీకరణ నేపథ్యంలో అంశాలను వివరించారు. పూసపాటి కృష్ణంరాజు కథలపై మందలపర్తి కిశోర్ మాట్లాడారు. కార్యక్రమంలో కత్తైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి, మాకినీడి సూర్య భాస్కర్, మోకా రత్నరాజు, చింతాకొండలరావు, పోనుగుమట్ల అశోక్‌కుమార్ పాల్గొన్నారు. సాహిత్య అకాడమీ ఇన్‌చార్జి టీఎస్ చంద్రశేఖరన్ సదస్సునుపర్యవేక్షించారు.

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

● రూ.50 లక్షల ఆదాయం



దర్శనంకోసం బారులు తీరిన భక్తులు

అన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవుదినం కావడంతోపాటుగా దశమి, ఏకాదశి పర్వదినం, మాఘమాసంలో చివరి వివాహ ముహూర్తం కావడంతో వివాహాలు చేసుకున్న జంటలతో ఈ రద్దీ నెలకొంది. ఉచిత దర్శనానికి మూడుగంటలు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు సమయం భక్తులు వేచి ఉన్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో రూ.200 అంత్రాలయ దర్శన టిక్కెట్లను నిలుపుదలచేసి శీఘ్రదర్శనానికి మాత్రమే అనుమతించారు. ఆలయ ఈవో సుబ్బారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 4 వేల వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.50లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవ నిత్యాన్నదాన పథకం ద్వారా 4500 మందికి అన్నప్రసాద వితరణ గావించారు.



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఇబ్బందులు

పిఠాపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎండతీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పిఠాపురం పట్టణం పాటు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచే ఎండ తీవ్రత గణనీయంగా పెరిగింది. గరిష్ఠంగా 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఉక్కపోతతో పాటు వేడి వాతావరణంతో చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సామర్లకోటలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సామర్లకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల క్రితం నెలకొల్పిన ఉన్నత పాఠశాల, కళాశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని వివిధ హోదాల్లో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నతపాఠశాల, జూనియర్ కళాశాలల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆయా విద్యా సంవత్సరాల్లో చదువుకున్న వారంతా కలిసి ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమ గురువులను శాలువాలు, పూలమాలలతో స త్కరించి జ్ఞాపికలు అందజేశారు. సామూహిక విందు భోజనాలను ఆరగించారు. కార్యక్రమానికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్, తుమ్మల రామస్వామి(బాబు)లు హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు పసల పద్మ రాఘవరావు ఆధ్వర్యంలో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వవిద్యార్థుల్లో అంతర్జాతీయ రొయ్యల ఎగుమతిదారుల అసోసియేషన్ మాజీ చైర్మన్ యార్లగడ్డ సూర్యారావు, జాతీయస్థాయి కాంట్రాక్టర్ చక్కని ప్రభాకరరావు, సామర్లకోట మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం, కంకణాలపల్లి సీతారామ స్వామి, డాక్టర్ కొప్పిరెడ్డివీరాస్వామి, కె. పద్మనాభం, టీపీఎస్.బోస్‌ను సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులు పసల పద్మరాఘవరావు, కెఎస్ఎన్.మూర్తి, దవులూరి సుబ్బారావు, రెడ్నం లక్ష్మీపతిరావు, గంధం రామకృష్ణ, యండ్రు ప్రభాకరరావు, సత్తార్ పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా నాగార్జున మాస్టారు వ్యవహరించారు. పలు ప్రదర్శనలు అలరించాయి.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

సామర్లకోట మెహెర్ కాంప్లెక్స్ వద్ద ఉన్న మహాలక్ష్మీ గణపతి ఆలయంలో మాఘమాస పర్వదినాలు పురస్కరించుకుని ఆదివారం జరిగిన విశేష పూజలకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు తురుమళ్ళ శేషకుమార్ తదితర పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య మృత్యుంజయ పూజలు, సూర్యనమస్కారములు, పుష్పార్చన పూజలను రాజప్ప నిర్వహించారు. పండితుల వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు.

చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలి



కాకినాడ రూరల్: గంగనాపల్లిలో చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న ఈవోపీఆర్డీ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ఇళ్ల వద్ద సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వానపాములతో వర్మీకంపోస్టును తయారుచేయాలని కాకినాడ రూరల్ మండలం ఈవోపీఆర్డీ ఎం.శ్రీరామఆంజనేయులు తెలిపారు. గంగనాపల్లిలో పంచాయితీ కార్యదర్శి కర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేరుచేసే విధానాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీచేసి నూతన చెత్తబుట్టలను అందజేశారు. అనంతరం ఇంద్రపాలెం గ్రామ పంచాయితీ పరిధిలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీలో ఈవోపీఆర్డీ పాల్గొని క్లాప్ మిత్రలకు చెత్తసేకరణపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌పై ఆయన వివరించారు.

తడి, పొడి చెత్తను వేరుగానే ఉంచాలి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరుగానే ఉంచాలని గొల్లప్రోలు ఈవోపీఆర్డీ కుమార్ సూచించారు. చేబ్రోలులో ఇంటింటా చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది ఇంటింటికి వచ్చి చెత్త సేకరిస్తారని, వీధుల్లో వేయవద్దని కోరారు. ప్రతి గృహానికి ఇచ్చిన డస్ట్‌బిన్నుల్లో తడి, పొడి చెత్తలను వేయాలని చెప్పారు. అన్ని గ్రామపంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని స్పెషల్‌డ్రైవ్‌గా నిర్వహించడంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.



చేబ్రోలులో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

పీఆర్ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు మహ్మద్ సంధాని అధ్యక్షతన నిర్వహించారు. గత ఏడాది కాలంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సంఘం ఆదాయ, వ్యయంపై సభ్యులు చర్చించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని విశిష్టసేవలు అందించిన సీనియర్ పెన్షనర్స్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వీఎస్‌జేవీ రమణరావు, కోశాధికారి పి.పట్టాభిరామయ్య, గౌరవాధ్యక్షుడు వైవీ జగన్నాధరావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

మంత్రితో కలిసి క్రికెట్ మ్యాచ్ తిలకించిన ఎంపీ



మంత్రి లోకేష్‌తో ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఇండియా-పాకిస్థాన్ వన్ డే క్రికెట్ మ్యాచ్‌ను రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌తో కలిసి రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు తిలకించారు. వారితో పాటు విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని చిన్ని, తెలుగు సినీ దర్శకుడు సుకుమార్ ఉన్నారు.

ఒలింపియాడ్ పరీక్ష

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్‌లోని ఎంఎస్ఎన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన భారత రాజ్యాంగంపై ఒలింపియాడ్ పరీక్షకు విశేష స్పందన లభించింది. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు 2 కేటగిరీలుగా నిర్వహించిన పరీక్షకు 147మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ అందజేశామని ప్రిన్సిపాల్ నాగిని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. కరస్పాండెంట్ లక్ష్మీతులసి పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఘనంగా బల్లల పండుగ



కరపలో పూజలు చేస్తున్న రజకులు

కరప, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కరపలో ఆదివారం శివగంగ రజక సంఘం ఆధ్వర్యంలో బల్లల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా వీధులకు చెందిన రజకులు తీన్‌మార్ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి సిపాయి చెరువు వద్దకు చేరుకున్నారు. చాకిరేవులోని బల్లలకు పసుపు కుంకుమ రాసి వారి కులదేవత ఈదమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. రజకుల ఆరాధ్యదైవం సంత గాడ్గ బాబా 149వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళ్లర్పించారు. వేడుకల్లో సంఘ గౌరవాధ్యక్షుడు సైనవరపు సత్యనారాయణ, అధ్యక్షుడు మురమళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి సైనవరపు సతీష్, కోశాధికారి మంచాల శ్రీనివాస్, కాకినాడ ఈశ్వరరావు, సైనవరపు భవానీశంకర్, కొడమంచిలి పద్దరాజు, సైనవరపు వెంకటరమణ, మంచాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఉత్పాదకత ఇంధన వనరులు వినియోగించాలి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అంతరించుకుపోతున్న సంప్రదాయ ఇంధన వనరుల వినియోగం తగ్గించి, ఉత్పాదకత ఇంధన వనరులను వినియోగించాలని ఓఎన్‌జీసీ ఈస్టర్న్ ఆఫ్ షోర్ ఎనర్జీ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ప్రబల్‌సేన్ గుప్తా, అనుపమ్ సక్సేనా కోరారు. ఆదివారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఓఎన్ జీసీ హెచ్‌టీపీ కార్యాలయం వద్ద సాక్షం కార్యక్రమంలో భాగంగా సైక్లోథాన్ అవగాహన సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సాక్షం కోఆర్డినేటర్ మహ్మద్ రఫీ, చీఫ్ కోఆర్డినేటర్ వాసుదేవన్ బాలాజీ, గోదావరి సైక్లింగ్ క్లబ్, ఓఎన్‌జీసీ సభ్యులు,విద్యార్థులు ఉన్నారు.

వైభవంగా భావనారాయణస్వామి తిరునాళ్లు

పోటెత్తిన వేలాది మంది భక్తులు





ఆలయంలో భావనారాయణస్వామి, స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మాఘమాస మహోత్సవాల్లో భాగంగా గత నాలుగు ఆదివారాలుగా నిర్వహిస్తోన్న శ్రీ భావనారాయణస్వామి తిరునాళ్ల వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా జరుగుతున్నాయి. కాకినాడ రూరల్ సర్పవరంలో వేంచేసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామిని దర్శించుకునేందుకు చివరి నాలుగో ఆదివారం తెల్లవారు జాము నుంచే అనేక ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలాచరించి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆవుపిడకలతో ఏర్పాటు చేసిన పొయ్యిపై పాలపొంగళి తయారు చేసి మొలకెత్తిన పెసలు, రేగుపండ్లు, అరటి పండ్లను స్వామవారికి నైవేద్యంగా నివేదించారు. అనంతరం ఈ ప్రసాదాన్ని మహిళా భక్తులు చీరకొంగుల్లో ఒడిసిపట్టుకుని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ముందుగా భావనారాయణస్వామిని దర్శించుకున్న భక్తులు ఈశాన్యంలోని లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఆదిశేషు శ్రీభావనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎం.లక్ష్మీనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో దాతలు మామిడాల శ్రీనివాసరావు, బోనం సతీష్, చోడవరపు పవన్‌కుమార్, తిరగటి సురేష్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు భారీ అన్నదానం చేశారు. మాఘ మాసోత్సవాల్లో ఆఖరి ఆదివారం స్వామివారిని దర్శించుకునేందుకు సుమారు 50 వేల మంది భక్తులు విచ్చేసినట్లు దేవదాయ, ధర్మదాయ ఈవో ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు. 23రోజుల్లో ఆలయానికి రూ.22,60,928 ఆదాయం లభించగా ఆదివారం రూ.4,55,638 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ సమస్య లేకుండా బందోబస్తు నిర్వహించారు.

కూటమి అభ్యర్థి పేరాబత్తులకు అండగా నిలవాలి





తాళ్లరేవు: చొల్లంగిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల, గొల్లప్రోలు రూరల్: ప్రచారం నిర్వహిస్తున్న వర్మ

తాళ్లరేవు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు అండగా నిలిచి పట్టభద్రులంతా విజయంవైపు పయనించాలని, అభివృద్ధికి మద్దతు తెలపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం చొల్లంగిపేట ప్రవేటుస్కూల్స్ యాజమాన్యం అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ పేరాబత్తులను గెలిపించాలని కోరారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్ బాలయోగి మాట్లాడుతూ మేధావులంతా ఆంధ్రప్రదేశ్ స్థితిగతులను అర్థం చేసుకుని అభివృద్ధి వైపు పయనించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, కట్టా త్రిమూర్తులు, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

గొల్లప్రోలు రూరల్: ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు అండగా నిలిచి ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. గొల్లప్రోలు

కూటమి నాయకుల ప్రచారం

మండలం ఏ.విజయనగరంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కరప: ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్‌లు తమ ఓటుహక్కును వినియోగించుకుని కూటమి అభ్యర్థి పేరాబత్తులకు ఘన విజయం చేకూర్చాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు విజ్ఞప్తి చేశారు. కరప మండలం వేళంగిలో గ్రాడ్యుయేట్స్ యూత్ కార్యాలయంలో పలువురు గ్రాడ్యుయేట్ ఓటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పేరబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు. పిల్లి దంపతులను గ్రాడ్యుయేట్‌యూత్ సభ్యులు సన్మానించారు. టీడీపీ సీనియర్ నేత చుండ్రు వెంకన్నరాయచౌదరి, మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నరావు, మేడిశెట్టి పట్టాభి, సానా శ్రీను, గరగ రామయ్య, మేడిశెట్టి పండు, ఖండవల్లి గుణ, గ్రాడ్యుయేట్స్ యూత్ ప్రతినిధులున్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయ ఈవో బళ్ళ నీలకంఠం

సామర్లకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామభీమేశ్వరాలయంలో ఈ నెల 26న మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం తెలిపారు. ఆలయ ఆవరణలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఈవో నీలకంఠం, చీఫ్ ఫెస్టివల్ అధికారి తలాటం సూర్యనారాయణ మాట్లాడుతూ సాధారణ భక్తులకు దర్శనాలు వేగవంతం అయ్యేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. వీఐపీ దర్శనాలకు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పవిత్ర స్నానాలాచరించేందుకు కోనేరు పుష్కరిణిలో గోదావరి జలాలతో పాటు దాతలు సమకూర్చిన గొట్టపుబావి సహాయంతో భూగర్భ జలాలను పంపింగ్ చేసినట్లు చెప్పారు. గోదావరి పుష్కరిణి, దాతలు సమకూర్చిన జల్లుస్నాన ఘట్టాలను సిద్ధం చేశామన్నారు. ప్రత్యేక అన్నదాన శిబిరాలు ఏర్పాటుచేసినందున సుమారు 30 వేలమందికి అన్నదానం జరుగనున్నట్లు చెప్పారు. స్వచ్ఛంద సంస్థలతో చిన్నారులకు పాలు, రొట్టెలు, అల్పాహారం, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. బయోటాయ్‌లెట్లను ఆలయ కోనేరు పుష్కరిణి సమీపాన ఏర్పాటుచేశామన్నారు. ఆలయ ఆవరణను విద్యుద్దీపాలంకరణలతో అలంకరించామన్నారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయడమే గాక కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి నిరంతరం ఆలయంలో సమాచారాన్ని భక్తులకు చేరవేసేలా చర్యలు తీసుకున్నామని వారు తెలిపారు. సమావేశంలో ధర్మకర్తలమండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, ఆలయ అర్చకులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, భీమేశ్వరశర్మ, వెంకన్నబాబు, సూపరింటెండెంట్ ఏవీవీటీ.ఈశ్వరరావులు తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లుల విడుదలకు కృషి చేయాలి'



ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న జలజీవన్ మిషన్ పనుల పెండింగ్ బిల్లుల విడుదలకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం కాకినాడ ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో గల ఓ హోటల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యుల ఎన్నిక జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా కె.రామలింగరాజు, జనరల్ సెక్రటరీగా కె.శ్రీనివాసప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా పీవీ బలరామరాజు, చీఫ్ అడ్వైజర్‌గా ఏ.రామారావు, వైస్ ప్రెసిడెంట్లుగా వి.రవికుమార్‌రెడ్డి, ఎం.మధుకుమార్, ఎల్.వెంకటేశ్వరరావు, సెక్రటరీ బి.శేషగిరిరావు, ఎన్‌వీఆర్‌కే రాజు, ట్రెజరర్‌గా కె బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా టీవీవీ సత్యనారాయణ, కేవీవీ.సత్యనారాయణరెడ్డి, ఎంఎస్ రవికుమార్, ఏ.నరసింహనాయుడులను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంట్‌లో కీలకపాత్ర



హాకీ టోర్నమెంట్‌లో కీలక పాత్ర పోషిస్తున్న బాల్ మేనేజర్ వలంటీర్లు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో సివిల్ సర్వీసెస్ నేషనల్ హాకీ టోర్నమెంట్‌లో సుమారు 50మంది బాల్ మేనేజర్ వలంటీర్లే కీలక పాత్ర పోషిస్తున్నారు. క్రీడాకారుల ప్రతీ అవసరాన్ని తీరుస్తూ కీలకంగా మారారు. వారంతా హాకీ క్రీడాకారులే కొంతమంది లెర్నింగ్ స్టేజ్‌లో ఉంటే మరికొంతమంది జిల్లా స్థాయి నేషనల్ స్థాయి హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు. వారిలో 90శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఉండడం గమనార్హం. వారిని కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ దత్తత తీసుకుని వారికి కావాల్సిన సౌకర్యాలు సమకూరుస్తుంది.

బాలికోన్నత పాఠశాలలో పనుల పరిశీలన

గొల్లప్రోలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ రూమ్‌ల నిర్మాణానికి పీఎం శ్రీ పథకం ద్వారా నిధులు మంజూరైనట్టు ఎస్ఎస్ఏ డీఈఈ టి.మంగాదేవి తెలిపారు. నిధులతో పాఠశాల భవనాల మొదటి అంతస్తులో చేపడుతున్న పనులను ఆమె ఆదివారం పరిశీలించి నాణ్యతతో నిర్వహించాలని సూచించారు. ఏఈఈ చక్రధర్ తదితరులున్నారు.

నేటి నుంచి దుర్గాడలో కల్యాణోత్సవాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో వేంచేసి ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 24 నుంచి 28 వరకూ జరగనున్నాయి. సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు మంగళస్నానాలు, పెళ్లికొడుకు, కూతురు అలంకారం, పసుపువాయ, మధ్యాహ్నం గ్రామోత్సవం, రాత్రి స్వామి కల్యాణం జరుగుతాయి. 25న మధ్యాహ్నం గ్రామోత్సవం, 26న మహాశివరాత్రి, రాత్రి సదస్యం, అనంతరం లింగోద్భవ అభిషేకం, 27న రాత్రి కల్యాణమూర్తులకు పూజా కార్యక్రమం, 28న ఉదయం త్రిశూలస్నానం, అన్నసమారాధన, రాత్రి శ్రీపుష్పయాగం జరుగుతాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ సేవాసమితి సభ్యులు కోరారు.

నేటి నుంచి రాజశేఖరస్వామి కల్యాణ మహోత్సవాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని సోమవారం నుంచి కొత్తపల్లిలో శ్రీబాలత్రిపురసుందరి సమేత రాజశేఖరస్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు ఇలపర్తి రామజోగీశ్వరశర్మ, సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. సోమవారం గామోత్సవం, రాత్రి 7గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, 25న ఉదయం స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలు, సాయంత్రం కోలాటం, 26న మహాశివరాత్రి సందర్భంగా అభిషేకాలు, కుంకుమ పూజలు, సాయంత్రం సదస్యం, లలితా పారాయణం, 27న సాయంత్రం పాటల పోటీలు, 28న సాయంత్రం తీర్థం, రథోత్సవం, అనంతరం కోలాటం, మార్చి 1న శనివారం పుష్పయాగం జరగనుంది.

26న సామూహిక మహా రుద్రాభిషేకం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 26వతేదీ మహా శివరాత్రి పురస్కరించుకుని కాకినాడ రామారావుపేటలోని ఆదిగురు యోగ పీఠంలో సామూహిక మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు సద్గురు సచ్చిదానంద యోగి తెలిపారు. ఆదివారం పీఠంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రస్తుత తరానికి తెలిసేలా మహాశివరాత్రి రోజున రాత్రి 7.30 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్య లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో పీఠం సభ్యుడు ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'సెల్‌టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి'

గొల్లప్రోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సెల్‌టవర్ నిర్మాణ పనులను తక్షణం నిలిపివేయాలని గొల్లప్రోలులోని ఈబీసీ కాలనీకి చెందిన కౌన్సిలర్లు పి.మంగలక్ష్మీ, వి.లక్ష్మీనారాయణ సహా కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గొల్లప్రోలు తహశీల్దారు, నగరపంచాయతీ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆరోగ్యానికి ముప్పువాటిల్లే అవకాశం ఉందని, దీనిపై అన్నివర్గాల ప్రజల్లో ఆందోళనవ్యక్తమవుతుందన్నారు. తమ అభిప్రాయాలు తీసుకోకుండా సెల్‌టవర్ నిర్మాణ పనులు ఎలాచేపడతారని వారు ప్రశ్నించారు. తమ ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాన్ని ఆపివేయాలని వారు కోరారు.

శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానం
అన్నవరం-533406, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఆర్.సి.నెం.సి1/461034/2024. తేది.21-02-2025

ఇ-ప్రొక్యూర్మెంట్/టెండరు కం బహిరంగ వేలము ప్రకటన

శ్రీ స్వామివారి దేవస్థానమునకు సంబంధించిన ఈ దిగువ ఐటమ్ నకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డు టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.సం.	వివరములు	ప్రథమ ధరావత్తు రూ.	షెడ్యూల్ ఖరీదు
1.	లీజులు విభాగము		
1	రత్నగిరి వనదుర్గ ఆలయం దగ్గర గల మెయిన్ కేంటిన్ (5వ పర్యాయం)	10,00,000/-	2.సం.లు
2	కొండపైన బుకింగ్ కాంప్లెక్స్ ఎదురగా గల షాపు నెం.5 (కూల్ డ్రింక్ షాపు)	10,00,000/-	2.సం.లు
3	కొండ దిగువ టోల్ గెట్ నందు రెండు చక్రముల వాహనములకు టోల్ ఫీజు వసూలు చేసుకోను లైసెన్స్ హక్కునకు	5,00,000/-	2.సం.లు
4	కొండ దిగువ మూడు చక్రముల వాహనముల (ఆటో) టోల్ ఫీజు వసూలు చేసుకోను లైసెన్స్ హక్కునకు	3,00,000/-	2.సం.లు
5	సత్యనికేతన్ షాపు నెం.7	1,00,000/-	3.సం.లు
6	కొండ దిగువ బైపాస్ నందు నూతనముగా నిర్మించిన నమూనా ఆలయం వద్ద కొబ్బరికాయ, అరటి పళ్ళు మరియు ఇతర పూజ ద్రవ్యములు షాపు	50,000/-	3.సం.లు
7	కొండ దిగువ బైపాస్ నందు నూతనముగా నిర్మించిన నమూనా ఆలయం వద్ద ఫాన్సీ, కూల్ డ్రింక్స్ & టీ స్టాల్	50,000/-	3 సం.లు
2.	అన్నదానం విభాగము		
8	పాలు మరియు పెరుగు ది.1-4-2025 నుండి 31-03-2026 వరకు	2,00,000/-	1 సం.
9	కూరగాయలు సరఫరా ది.01-04-2025 నుండి 31-03-2026 వరకు	2,00,000/-	1 సం.
10	అరటి ఆకులు సరఫరా ది.01-04-2025 నుండి 31-03-2026 వరకు	25,000/-	1 సం.
3.	ఆలయ విభాగము		
11	రాజమహేంద్రవరం నందు గోదావరి హారతులు ఇచ్చు హారతి సామాగ్రిని కొత్త ఇత్తడితో తయారు చేసి సరఫరా చేయుటకు	1,00,000.00	30 రోజులలో
12	ఆలయ విభాగమునకు పువ్వులు మరియు పూలదండలు సరఫరా చేయుటకు	1,25,000/-	1 స.
4.	అకౌంట్స్ విభాగము		
13	వివిధ రకరముత రిజిష్టర్లు మరియు థర్మల్ రోల్స్ వగైరా ది.01-04-2025 నుండి ది.31-03-2026 వరకు	50,000/-	1 సం.
14	స్టేషనరీ వస్తువులు 01-04-2025 నుండి ది.31-03-2026 వరకు	30,000/-	1 సం.
5.	పి.ఆర్.ఒ విభాగము		
15	1) ACP Panel sheets & Sign, polyvinyl Sticker,22, వివిధ ప్రదేశములో ఆర్ట్ పెయింటింగ్ నార్మల్ పెయింటింగ్ మొదలగు వర్కు ది.01-05-2025 నుండి 30-04-2027	25,000/-	2 సం.లు
16	2) అవసరమగు ఆహ్వాన పత్రికలు, వాల్ పోస్టర్లు, పాంప్లెట్స్ బ్రోచర్స్ ప్రింటింగ్ మొదలగు వర్కు చేయుట కొరకు ది.01-05-2025 నుండి ది.30-04-2027	10,000/-	2 సం.లు
6.	ఇంజనీరింగ్ విభాగము		
17	దేవస్థానము నందు సివిల్ మరియు విద్యుత్ విభాగముల వివిధ అభివృద్ధి పనులు చేయుట గురించి	-	-

బహిరంగ వేలం నందు పాల్గొను వారు హిందువులై వుండవలెను. ఈ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డు టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును. టెండరు షెడ్యూల్లులను ది.01-03-2025 నుండి ది.06-03-2025 వరకు కార్యాలయ పనివేళలలో రూ.1,180/- చెల్లించి పొందవచ్చును. టెండరు షెడ్యూల్ ను ది.07-03-2025న ఉదయం 11.00 గంటల వరకు కొండపై కళావేదిక వద్ద వుంచబడిన టెండరు బాక్సు నందు వేయవలెను. సీరియల్ నెం.1 నుండి 7 వరకు బహిరంగ వేలం, సీల్డు టెండర్ మరియు ఇ-ప్రొక్యూర్‌మెంట్ నిర్వహించబడును. మరియు బహిరంగ వేలం నిర్వహించిన తదుపరి మాత్రమే సీల్డు టెండరు బాక్సు తెరవబడును. మరియు సీరియల్ నెం. 8 నుండి 16 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డు టెండరు మాత్రమే నిర్వహించబడును. సీరియల్ నెం.17తో ఇ-ప్రొక్యూమెంట్ వెబ్‌సైట్ **www.apeprocureement.gov.in** ను సంప్రదించవలెను. మరియు కార్యాలయము పని చేయు వేళల్లో లేదా ఫోన్ నెం.**9908789955, 7207335477** నందు సంప్రదించవలెను.

కార్యానిర్వహణాధికారి

వాజ్‌పేయి శత జయంత్యుత్సవాలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పెదశంకర్లపూడిలో ఆదివారం భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంత్యుత్సవాలు నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు ఇంటి వీర నాగేశ్వరరావు, చింతాకుల రామకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు కందా వీరాసామి, నాయకులు చింతాకుల బాబ్జి, వెంకటగిరిబాబు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పాపికొండలకు ఆరు బోట్లు

దేవీపట్నం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలు చూసేందుకు ఆదివారం ఆరుబోట్లలో 336మంది పర్యాటకులు వెళ్లారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పోశమ్మగండి అమ్మవారిని దర్శించుకుని అక్కడే ఉన్న బోటు పాయింట్ దగ్గర నుంచి ఉదయం బయలుదేరి న పర్యాటకులు పేరంటాలపల్లి చేరుకుని అక్క డ సాయంత్రం వరకు గడిపి తిరిగి సాయం త్రం గమ్యస్థానం చేరుకున్నారు. పోశమ్మగండి అమ్మవారి ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన


శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్ఐ లతాశ్రీ

కూనవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మర్రిగూడెం పంచాయతీలోని కొమరస్వామి గుట్టమీద వెలసిన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంవద్ద ఈనెల 26న జరిగే శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను కూనవరం ఎస్ఐ లతా శ్రీ ఆదివారం పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు జరగాలని ఎండో మెంట్ అధికారులకు సూచించారు. ఈసందర్భంగా పార్కింగ్, పడవ రేవులను పరిశీలించారు. ఈ ఉత్సవంలో ఎక్కువగా గిరిజనులు పాల్గొంటారు. గత ఐదేళ్ల నుంచి ఈ ఉత్సవానికి పడవ ఏర్పాటు చేయలేదు. ఈసారైన కూటమి ప్రభుత్వం పడవ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు


గొల్లగూడెంలోని శివాలయం

ఎటపాక,ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించి మండలంలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ప్రధానంగా గొల్లగూడెం, బుట్టాయిగూడెం, గన్నవరం, కనాయిగూడెం, తదితర గ్రామాల్లోని శివాలయాలను ముస్తాబు చేస్తున్నారు. శివాలయాలకు రంగులు అద్దుతూ విద్యుత్ ఆలంకరణ చేస్తున్నారు. శివరాత్రి రోజున వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లను సైతం సిదం చేస్తున్నారు. గొల్లగూడెం గోదావరినదీ ఒడ్డున ఉన్న శివాలయానికి ఎంతో చరిత్ర కలిగినదిగా పేరొందింది. సుమారు వందేళ్ల చరిత్ర ఉన్న శివాలయంగా స్థానికులు పేర్కొంటున్నారు.

1న దుకాణాలకు వేలం పాట

ఎటపాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వెంకటరెడ్డిపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యా ణ మహోత్సవం సందర్భంగా మార్చి 1న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు రాజమహేంద్రవరం దేవదాయధర్మాదాయశాఖ ఆలయ కార్యనిర్వహణాధి కారి గండి లక్ష్మీకుమార్ ప్రకటనలో తెలిపారు. మార్చి 14న స్వామివారి కల్యాణ మహోత్సవంను నిర్వహిం చనున్నట్లు చెప్పారు. మార్చి 13 నుంచి 16 వరకు ఆల య ప్రాంగణంలో తాత్కాలిక దుకాణాలు, తలనీలాలు పోగుచేసుకొనుట, వస్తువుల విక్రయాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగలవారు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా అడవిరాజులు బాబు పండుగ


వై.రామవరంలో అడవిరాజులబాబు పండుగలో భోజనాలు చేస్తున్న గిరిజనులు

వై.రామవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం అడవిరాజులబాబు పండుగలు పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. వై.రామవరంలో పలుచోట్ల మామిడి, జీడిమామిడి తోటల్లో అడవిరాజులు బాబుకు నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా పండుగల్లో మాంసపు వంటకాలతో గిరిజనులు సందడి చేశారు. ప్రతీఏటా మహాశివరాత్రికి నెలరోజుల ముందు నుంచి ఆది, శుక్ర, మంగళవారాల్లో ఈ పండుగలు చేయడం పరిపాటిగా వస్తోంది. అటవీ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న గిరిజనులకు ఎటువంటి ఆపద కలుగకుండా కాచికాపాడాలంటూ అడవి రాజులు బాబును కొలుస్తారు.

‘పేరాబత్తులను గెలిపించండి’


పేరాబత్తుల గెలుపుపై ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

దేవీపట్నం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఆదివారం దేవీపట్నం మండలంలో కొండమొదలు ఆర్అండ్ఆర్ కాలనీ, ఇందుకూరు, ఇందుకూరుపేట, శరభవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నా కర్, చెల్లుబోయిన శ్రీనివాసరావు పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్‌లు మాట్లాడుతూ పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, టీడీపీ మండలాధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వర్లు, తెలుగు యువత అధ్యక్షుడు లంక హరిశ్చంద్రుడు, మాగాపు బాబురావు, ముచ్చు నాగేశ్వరరావు, గౌరీశ్వరి, చంటి పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజా, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడే పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో సమస్యల పట్ల గొంతు వినిపించే నాయకులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల, పాఠశాలల బలోపేతానికి కృషిచేసేది ఒక్క పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనన్నారు. పీడీఎఫ్ ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి డీవీ రాఘవులను గెలిపించాలని కోరారు.

సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

చింతూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చింతూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) పేరిట చింతూరు క్రికెట్ అసోసియేషన్ సభ్యులు క్రికెట్ టోర్నమెంట్‌ని ఆదివారం చింతూరులో ప్రారంభించారు. మార్చి 3 వరకు టోర్నమెంట్ కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు చింతూరు డివిజన్ పరిధిలోని ఆరు జట్లు టోర్నమెంట్‌లో పాల్గొని తమ సత్తాని చాటుకోనున్నాయి. మొదటివిజేతకు రూ.30వేలు, రెండో విజేతకు రూ20వేలు బహుమతులు ప్రకటించారు. ప్రారంభ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు విల్సన్, లక్ష్మీపతి, హసన్, ఉదయ్, మడవి రాజు కమిటీ సభ్యులు సురేష్, గణేష్, బుచ్చిరాజు, ప్రదీప్, రియాజ్, శంకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

కూనవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఏఎస్‌డీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పోచవరం కాలనీ గ్రామస్తులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ గాంధీబాబు సహకారంతో టీడీపీ అరకు పార్లమెంట్ ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు చేతులమీదుగా ఈ పంపిణీ జరిగింది. ఈసందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఏఎస్‌డీఎస్ సంస్థ ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరినీ ఆదుకుంటుందన్నారు. గోదావరి వరదల్లో సైతం బాధితులకు ముందుకువచ్చి సహాయం అందించిందన్నారు. కందిపప్పు, శనగలు, బియ్యం, మేట్, తలగడ, పిల్లలకు సంబంధించిన దుస్తులు అందజేశారు. స్కూల్ ఆవరణలో ఉన్న తుప్పలు తొలగించి డ్రైనేజీ సైతం శుభ్రం చేశారు. ఏఎస్‌డీఎస్ కోఆర్డినేటర్ రవి, రామకృష్ణ, శుభాని, మహేష్ పాల్గొన్నారు.

పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా నిలవాలి

కూటమి నాయకుల ఎన్నికల ప్రచారం


ప్రత్తిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాలతో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు, నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు గంటా నూకరాజుల ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో కూటమి శ్రేణులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా నిలవాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి కరపత్రాలు పంచుతూ ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కొమ్ముల కన్నబాబు, మంతెన వెంకటరమణ, మదినే దొరబాబు, యర్రాబత్తుల గోవిందనాయుడు, చిలకమర్తి వీరభద్రం, రావూరి తాతాజీ, పోలిశెట్టి శ్రీనివాస్, మదినే స్వామి పాల్గొన్నారు.

రాజశేఖర్ గెలుపు కోరుతూ ప్రచారం

కిర్లంపూడి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ సోమవరంలో ఆదివారం పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకులు గండి బాబ్జి, కూటమి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటర్ల ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మంచికంటి శ్రీను, నీటి సంఘం అధ్యక్షుడు జ్యోతుల కోటి ఉన్నారు.

పేరాబత్తులదే విజయం

శంఖవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు బద్ది రామారావు ఆదివారం నెల్లిపూడిలో ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. మండల కో-ఆర్డినేటర్ బద్ది రామకృష్ణ, టి.వీరబాబు, కుక్కా లోవరాజు, పి.శివ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఏలేశ్వరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ ఎస్వీ రమణను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ యూనియన్ సభ్యులు రెండో రోజైన ఆదివారం నిరసన తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు సంయుక్తంగా డిపో గేటు వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. డిపోకు చెందిన డ్రైవర్ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేశారని, ఆయన్ను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్‌పీ రావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

‘లోవ’కు పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ.3.31లక్షల ఆదాయం



తుని రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకస్వాములు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.3.31లక్షల ఆదాయం సమకూరింది. భక్తుల కోసం ఆలయ ఈవో విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు


పరీక్షలు రాసి వస్తున్న అభ్యర్థులు

గండేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు డిప్యూటీ ప్రోఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 10నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు 6,460మందికి గాను 5665మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరిగిన పరీక్షకు 6459మందికి గాను 5665మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు నేతృత్వంలో పది మంది ఎస్ఐలు, 60మంది సిబ్బంది, 25మంది మహిళా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాన్ని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, గండేపల్లి తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్ పరిశీలించారు. ఆదిత్య యాజమాన్యం అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించింది.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి


ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్‌కిషోర్‌కి వినతిపత్రం అందజేస్తున్న మల్లేపల్లి గ్రామస్తులు

గండేపల్లి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని మల్లేపల్లి గ్రామస్తులు ఎలక్ట్రికల్ ఏఈకి ఆదివారం వినతిపత్రం అందించారు. మల్లేపల్లిలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివారం గ్రామస్తులంతా మల్లేపల్లి పంచాయతీలో సమావేశమయ్యారు. విద్యుత్ ఏఈ కిరణ్‌కిషోర్ హాజరయ్యారు. గ్రామస్తులు మాట్లాడుతూ మల్లేపల్లిలో ఎక్కువసార్లు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, ట్రాన్స్‌ఫార్మర్ పవర్ సరిపోక లోవోల్టేజీ రావడంతో ఇబ్బందులు పడుతున్నామని ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. 24గంటలు సరఫరా ఇవ్వాలని కోరారు. ఈసమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు. మల్లేపల్లి లైన్‌మెన్ సురేష్, సర్పంచ్ బలిరెడ్డి గంగరాజు, దిడ్డి చినశ్రీను, కాటేపల్లి వీరభద్రం, దార్లంక మాణిక్యం, బత్తుల కాపు, దార్లంక నూకరాజు పాల్గొన్నారు.

చెత్త ద్వారా కంపోస్టు ఎరువు తయారీ


ధర్మవరంలో తడి చెత్త, పొడి చెత్త సేకరణ పరిశీలిస్తున్న డీఎల్‌పీవో బాలామణి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చెత్త ద్వారా కంపోస్టు ఎరువు తయారీ సాధ్యపడుతుందని పెద్దాపురం డీఎల్‌పీవో బాలామణి చెప్పారు. ధర్మవరంలో ఆదివారం తడి చెత్త, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.కామరాజు పర్యవేక్షణలో ఇంటింటి వద్ద చెత్త సేకరణ తీరును ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించడం వల్ల వర్మీకంపోస్టు తయారవుతుందని, ఈఎరువు పొలంలో పంటలకు, కూరగాయల మొక్కలకు వేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీల విస్తరణాధికారి కాశీ విశ్వనాద్ పాల్గొన్నారు.

నల్లమిల్లి కుమారుడి రిసెప్షన్: హాజరైన ఎస్వీఎస్ అప్పలరాజు



జగ్గంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు రిసెప్షన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పలరాజు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. అలాగే జగ్గంపేట క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జె.తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎల్లేటి అప్పారావు, కుమార్తె దివ్యభారతి, నాగ వెంకట సత్య ప్రసాద్ వివాహ వేడుకకు జనసేన జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై ఆశీర్వదించారు. ఆయన వెంట మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, సూరప రెడ్డి నరేష్, అడబాల వీరబాబు, పాఠంశెట్టి రమేష్, రాయి సాయి, గుంటముక్కల చిన్న, పులి ప్రసాద్, రాజు, కోలమూరు బుజ్జి ఉన్నారు.

మరిప్రాకలో డీఎల్‌పీవో పరిశీలన


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

జగ్గంపేట,ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మరిప్రాక గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పెద్దాపురం డీఎల్‌పీవో బాలామణి పరిశీలించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఇంటి పన్ను, వాటర్ ట్యాక్స్ పన్నులు మార్చి 31వ నాటికి పూర్తి వసూలు చేయాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మురారి దుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



గండేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మురారి గ్రామ శివారున మామిడితోటలో కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా కనకదుర్గమ్మ వెలసింది. ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది.భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుం బ సమేతంగా ఆలయప్రాంగణంలో వంటావార్పు చేసుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు.

బీచ్ రోడ్‌లో శివాజీ శోభాయాత్ర

తొండంగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం బీచ్ రోడ్‌లో భారీ శోభాయాత్ర నిర్వహించారు. కాషాయ పతాకాలు ధరించి మోటార్ వాహనాలపై హిందూ యువకులు జైజై నినాదాలతో శోభాయాత్ర నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మహా కుంభమేళాలో ఎమ్మెల్యే నెహ్రూ కుటుంబం పుణ్యస్నానాలు



జగ్గంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో భాగంగా ఆదివారం టీటీడీ మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,మణి దంపతులు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు, తనయుడు అనీష్‌నెహ్రూ గంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గంగాదేవికి పూజలు చేసి హారతులు ఇచ్చారు. ఆపై పితృదేవతలను స్మరించుకుంటూ బ్రాహ్మణులకు వస్త్రదానం చేశారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు

తుని రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో గల ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలను కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ శ్రీనివాస్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటుగా అధ్యాపక బృందం ఉన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

తొండంగి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బెండపూడిలో కొలువైన షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం కాకడ హారతి, పంచామృతాభిషేకం, అర్చన, మధ్యాహ్న హారతి, ధుని పూజ అనంతరం సాయంత్రం సాయి పల్లకి సేవ జరిపారు. ఆలయ అర్చకులు పవన్ కుమార్ శర్మ పూజా క్రతువులు నిర్వహించారు. సోమవారం ఆలయం వద్ద భారీ అన్న దానం నిర్వహించనున్నారు.

సత్యదేవుడికి వేడుకగా రథసేవ


రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

అన్నవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జిత సేవయిన రథసేవ ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన టేకు రథంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

రాజశేఖర్‌ను గెలిపించాలి

రౌతులపూడి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖర్‌ను నెగ్గించాలని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. ఎమ్.కొత్తూరులో ప్రచారం నిర్వహించారు.

శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానం

అన్నవరం-533406, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఆర్.సి.నెం.సి1/461034/2024, తేది.21-02-2025

ఇ-ప్రొక్యూర్మెంట్/టెండరు కం బహిరంగ వేలము ప్రకటన

శ్రీ స్వామివారి దేవస్థానమునకు సంబంధించిన ఈ దిగువ ఐటమ్ నకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డు టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.సం.	వివరములు	ప్రథమ ధరావత్తు రూ.	షెడ్యూల్ ఖరీదు
1.	లీజులు విభాగము		
1	రత్నగిరి వనదుర్గ ఆలయం దగ్గర గల మెయిన్ కేంటిన్ (5వ పర్యాయం)	10,00,000/-	2.సం.లు
2	కొండపైన బుకింగ్ కాంప్లెక్స్ ఎదురగా గల షాపు నెం.5 (కూల్ డ్రింక్ షాపు)	10,00,000/-	2.సం.లు
3	కొండ దిగువ టోల్ గెట్ నందు రెండు చక్రముల వాహనములకు టోల్ ఫీజు వసూలు చేసుకోను లైసెన్స్ హక్కునకు	5,00,000/-	2.సం.లు
4	కొండ దిగువ మూడు చక్రముల వాహనముల (ఆటో) టోల్ ఫీజు వసూలు చేసుకోను లైసెన్స్ హక్కునకు	3,00,000/-	2.సం.లు
5	సత్యనికేతన్ షాపు నెం.7	1,00,000/-	3.సం.లు
6	కొండ దిగువ బైపాస్ నందు నూతనముగా నిర్మించిన నమూనా ఆలయం వద్ద కొబ్బరికాయ, అరటి పళ్ళు మరియు ఇతర పూజ ద్రవ్యములు షాపు	50,000/-	3.సం.లు
7	కొండ దిగువ బైపాస్ నందు నూతనముగా నిర్మించిన నమూనా ఆలయం వద్ద ఫాన్సీ, కూల్ డ్రింక్స్ & టీ స్టాల్	50,000/-	3 సం.లు
2.	అన్నదానం విభాగము		
8	పాలు మరియు పెరుగు ది.1-4-2025 నుండి 31-03-2026 వరకు	2,00,000/-	1 సం.
9	కూరగాయలు సరఫరా ది.01-04-2025 నుండి 31-03-2026 వరకు	2,00,000/-	1 సం.
10	అరటి ఆకులు సరఫరా ది.01-04-2025 నుండి 31-03-2026 వరకు	25,000/-	1 సం.
3.	ఆలయ విభాగము		
11	రాజమహేంద్రవరం నందు గోదావరి హారతులు ఇచ్చు హారతి సామాగ్రిని కొత్త ఇత్తడితో తయారు చేసి సరఫరా చేయుటకు	1,00,000.00	30 రోజులలో
12	ఆలయ విభాగమునకు పువ్వులు మరియు పూలదండలు సరఫరా చేయుటకు	1,25,000/-	1 స.
4.	అకౌంట్స్ విభాగము		
13	వివిధ రకరముత రిజిష్టర్లు మరియు థర్మల్ రోల్స్ వగైరా ది.01-04-2025 నుండి ది.31-03-2026 వరకు	50,000/-	1 సం.
14	స్టేషనరీ వస్తువులు 01-04-2025 నుండి ది.31-03-2026 వరకు	30,000/-	1 సం.
5.	పి.ఆర్.ఒ. విభాగము		
15	1) ACP Panel sheets & Sign, polyvinyl Sticker.22. వివిధ ప్రదేశములో ఆర్ట్ పెయింటింగ్ నార్మల్ పెయింటింగ్ మొదలగు వర్కు ది.01-05-2025 నుండి 30-04-2027	25,000/-	2 సం.లు
16	2) అవసరమగు ఆహ్వాన పత్రికలు, వాల్ పోస్టర్లు, పాంప్లెట్స్ బ్రోచర్స్ ప్రింటింగ్ మొదలగు వర్కు చేయుట కొరకు ది.01-05-2025 నుండి ది.30-04-2027	10,000/-	2 సం.లు
6.	ఇంజనీరింగ్ విభాగము		
17	దేవస్థానము నందు సివిల్ మరియు విద్యుత్ విభాగముల వివిధ అభివృద్ధి పనులు చేయుట గురించి	-	-

బహిరంగ వేలం నందు పాల్గొను వారు హిందువులై వుండవలెను. ఈ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డు టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును. టెండరు షెడ్యూల్లను ది.01-03-2025 నుండి ది.06-03-2025 వరకు కార్యాలయ పనివేళలలో రూ.1,180/- చెల్లించి పొందవచ్చును. టెండరు షెడ్యూల్ ను ది.07-03-2025న ఉదయం 11.00 గంటల వరకు కొండపై కళావేదిక వద్ద వుంచబడిన టెండరు బాక్సు నందు వేయవలెను. సీరియల్ నెం.1 నుండి 7 వరకు బహిరంగ వేలం, సీల్డు టెండర్ మరియు ఇ-ప్రొక్యూర్‌మెంట్ నిర్వహించబడును. మరియు బహిరంగ వేలం నిర్వహించిన తదుపరి మాత్రమే సీల్డు టెండరు బాక్సు తెరవబడును. మరియు సీరియల్ నెం. 8 నుండి 16 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డు టెండరు మాత్రమే నిర్వహించబడును. సీరియల్ నెం.17తో ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.apeprocureement.gov.in ను సంప్రదించవలెను. మరియు కార్యాలయము పని చేయు వేళల్లో లేదా ఫోన్ నెం.9908789955, 7207335477 నందు సంప్రదించవలెను.

కార్యానిర్వహణాధికారి